క్లుప్తంగా

నేడు అండర్ రైల్వేజోన్‌లో నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా అండర్ రైల్వేజోన్ ప్రాంతాల్లో శనివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రామోజు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం కారణంగా ధర్మసాగర్ 60ఎంఎల్‌డీ నుంచి నీరు విడుదల నిలిచిపోతుందని తెలిపారు. దాంతో కరీమాబాద్, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్ఆర్ఆర్‌తోట, ఏకశిలనగర్, కాశికుంట, ఖిలా వరంగల్, దూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కలపెల్లి, లక్ష్మిపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు.

డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఐకాన్ హెల్త్‌కేర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నరేష్‌కుమార్

ఖిలా వరంగల్: వైద్య రంగంలో రాణిస్తూ ప్రజలు, వైద్య విద్యార్థులకు విశేషమైన వైద్య సేవలందిస్తున్నందుకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డుకు చెందిన సన్‌షైన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వేములపల్లి నరేష్‌కుమార్.. ఐకాన్ హెల్త్‌కేర్ అవార్డు –2023ను అందుకున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జయహర్షి కాన్వెన్షన్ హాల్‌లో మెడిక్స్ డిజిటల్ హెల్త్ బ్యాంక్ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ రీఫామ్ డాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో గురువారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ రావు, రాష్ట్ర కార్యదర్శి అజయ్ మిశ్రా నుంచి అవార్డును నరేష్ అందుకున్నారు.

రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి – ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై పరశురాములు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ప్రమాదవశాత్తు రైల్‌లో నుంచి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. వివరాలకు 94906 19031, 99498 59108 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పెరకవాడలో బైక్ చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ పెరకవాడలోని ఓ ఇంటి ఎదుట నిలిపిఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున చోరీ చేశారు. బాధితుడి కథనం ప్రకారం వరంగల్ 39వ డివిజన్ లక్ష్మినగర్‌కు చెందిన కుల్ల నాగరాజు ఆంజనేయుడి మాలవేసి పెరకవాడలోని కుటీరంలో ఉంటున్నాడు. గురువారం రాత్రి పార్క్ చేసిన వాహనం శుక్రవారం తెల్లవారు జామున కనిపించలేదు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

రైతు భవనంపై తప్పుడు ప్రచారం



నయీంనగర్: తెలంగాణ రైతు సంఘం రైతు భవనంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆరెకుల సంఘం, యూఎస్ఎఫ్ఐ, తెలంగాణ రైతు సంఘం నాయకులు ఖండించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రైతు భవనాన్ని మోర్తాల చందర్‌రావు కబ్జా చేయాలని చూస్తున్నారని తన బృందంతో కలిసి సోమిడి శ్రీనివాస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మోర్తాల చందర్‌రావు, బాషిపాక రమేష్, గోనె కుమారస్వామి, గణేష్, రాజేష్ నాయక్, జెండా రాజేష్, శివాజీ, రుమాల సుధాకర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



దేశాయిపేట: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ప్రైవేట్ సంస్థలోనూ అమలు చేయాలని బీఆర్‌హెచ్‌పీఎస్ (బడుగు రిజర్వేషన్ హక్కుల పోరాట సమితి) వ్యవస్థాపక అధ్యక్షుడు చింతం భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు దేశాయిపేటలోని సీకేఎం కళాశాల ఆవరణలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చింత భాస్కర్, నాయకులు సారం కట్టయ్య, దామెర శ్యామ్, తరాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



కాజీపేట అర్బన్: వినతిపత్రం అందజేస్తున్న పద్మ



వరంగల్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: కాజీపేటలోని ఏఆర్ఆర్‌నగర్, వైఎస్సార్‌నగర్‌లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి సీఎం కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిర్ర నర్సింగ్, భరత్, చాంద్‌పాషా, గుంటి కుమారస్వామి, భగవాన్ ఉపాధ్యాయ, శ్రీకాంత్, జీవన్, శ్రీనివాస్, కరుణాకర్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో స్థలాలు కేటాయించాలి

వరంగల్: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు పేద ప్రజలకు స్థలాలు కేటాయించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ కోరారు. ఈమేరకు వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ రేణుకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని జీఓ నంబర్ 58ప్రకారం దరఖాస్తు చేసుకున్న పేదలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్రా ప్రతాప్, ప్రేమలత, గోవర్ధన రాజు, నగేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయమా..?

హన్మకొండ: నగరంలో విద్యుత్ అంతరాయాలు కలిగితే ఫ్యూజ్ ఆఫ్ కాల్‌లో సంప్రదించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫోన్ నంబర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. సమాచారం అందిస్తే సిబ్బంది వచ్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారని తెలిపారు.

సబ్‌స్టేషన్ల వారీగా ఫోన్ నంబర్లు..

ప్రాంతం	సబ్‌స్టేషన్	ఫ్యూజ్ ఆఫ్ కాల్	ఏఈ
మట్టెవాడ	08702461619	9491075009	9440811349
దేశాయిపేట	9491075011	8332989176	9491058647
పోచమ్మమైదాన్	---	9491075013	9440811348
కేఎంసీ	08702461612	9491075013	9440811348
ఆరెపల్లి	9491075045	9493545861	7901628355
ఏనుమాముల	9492461904	9493545861	7901628355
అజంజాహిమిల్స్	9702461620	9491075008	9440811352
స్టేషన్ రోడ్	08702461621	9493545861	9440811350
ఖిలా వరంగల్	9491075012	9494859795	7901628356
శంభునిపేట	9493545867	9441384231	8333923910
కరీమాబాద్	08702461622	9491075018	9440811351
మామునూరు	9491075047	---	9440811355
బొల్లికుంట	9440234096	---	9440811355
గొర్రెకుంట	9491075007	---	7901628356

పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



గుడిసెవాసులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్

రామన్నపేట: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 11, 29వ డివిజన్లలో అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో గుడిసెవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 58 ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, పోతననగర్, రఘునాథ్‌కాలనీ, ఓఎస్‌నగర్‌లలోనూ పర్యటించారు. కార్యక్రమాల్లో 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి ఆర్డీఓ వాసుచంద్ర, మహేందర్, తహసీల్దార్ సత్యపాల్‌రెడ్డి, కల్పలత సూపర్‌బజార్ వైస్ చైర్మన్ ఎండీ.షఫి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న అజీజ్‌ఖాన్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిధుల వ్యయంతో ప్రస్తుతం ఉన్న మూత్రశాలల మరమ్మతులతో పాటు నూతనంగా మరికొన్నింటిని నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది నిఖిల్, సంతోష్, రాజేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

అంతా గప్‌చుప్!

- కలెక్టర్ తనిఖీ ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన అధికారులు
- బయటపడని డొల్లతనం



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కాళోజీ సెంటర్: వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రావీణ్య.. వివిధ శాఖల పనితీరును పరిశీలిస్తూ పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై శుక్రవారం ఉదయం సంబంధిత అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, సఖీ సెంటర్ నిర్వహణ గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికి కలెక్టర్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కలెక్టర్ తనిఖీ చేయడానికి వస్తున్నట్లు సమాచారం లీక్ కావడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది జాగ్రత్త పడినట్లు సమాచారం. లేదంటే పలు అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు శాతం, పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాల్లోని లొసుగులు, తదితర విషయాలు బయట పడేవని పలువురు ఆరోపిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం, సఖి సెంటర్ తనిఖీ

సమీక్ష అనంతరం కాశిబుగ్గలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎంజీఎం సమీపంలోని సఖి సెంటర్‌ను కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, చిన్నారులతో ముచ్చటించారు. ఈ తనిఖీలో కార్పొరేటర్లు పుర్కాన్, గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, జిల్లా సంక్షేమ అధికారి మాచర్ల శారద, సీడీపీఓలు విశ్వజ, శ్రీదేవి, రాధిక, పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్, సఖీ కేంద్రం శ్రీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఛాయాదేవి తదితరులు ఉన్నారు.

కన్నతల్లి కన్నా జన్మభూమి గొప్పది



మృత్తికతో చేతిముద్రలు వేసి ప్రదర్శిస్తున్న ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు, వాకర్స్

హన్మకొండ: జన్మనిచ్చిన తల్లి కన్నా ఆతల్లిని మోస్తున్న జన్మభూమి గొప్పదని ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి అన్నారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేరణ ఫౌండేషన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. హనుకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో జరిగిన కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని సూచించారు. మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం, మృత్తికతో చేతిముద్రలు వేసి సంతకాలు చేసి వాటిని ప్రదర్శిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, ఏకశిల వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు పి.ఎల్లాగౌడ్, దశరథ రామ్‌రెడ్డి, ప్రొఫెసర్ సుధాకర్, తిరుమలరావు, ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు బూర రామచందర్, సంపత్, స్వర్ణలత, సునీల్, శోభ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేదం



మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజు

కాజీపేట అర్బన్: సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేద వైద్యం ఎంతగానో దోహదపడుతుందని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. న్యూశాయంపేటలోని పద్మశాలి పరపతి సంఘం భవన ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఉచిత మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న నిరుపేదలకు ఉచిత మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అనిశెట్టి శ్రీధర్, కేదారి శ్వేత, కవిత, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వీనస్



హసన్‌పర్తి: ఇండియా పెంతెకొస్తే సంఘం తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా భీమారానికి చెందిన పెండ్యాల వీనస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌లో జరిగిన ఎన్నికలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మడికొండ: పీఏసీఎస్ దర్గా సొసైటీ ఆధ్వర్యంలో 64వ డివిజన్ మడికొండ, టేకులగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలకు మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో దర్గా సొసైటీ వైస్ చైర్మన్ మాదాసు బాబు, డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, శ్రీనివాసురెడ్డి, లింగం నరేందర్‌రెడ్డి, ఇనుగాల రజినీకర్‌రెడ్డి, సీఓ భూపాల్‌రెడ్డి, లింగారెడ్డి, వంశీ, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రైతులు బోగి మెట్టయ్య, దండిగం శ్రీనివాస్, రేవంత్, రవీందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంపై వివాదం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంపై వివాదం నెలకొంది. కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించడానికి ఇందిరా క్రాంతి పథం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఆయా శాఖల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఒకే గ్రామంలో రెండు కేంద్రాల ఏర్పాటు సందిగ్ధంగా మారింది. వివాదం నెలకొంటుండగానే ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యంగా కాగా, ప్రైవేట్ బ్రోకర్లు, రైస్‌మిల్లర్లు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని, ఇంటర్వ్యూలో మార్కుల వెయిటేజ్ ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి ఆరు నెలలకోసారి పీహెచ్‌డీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొన్నారు. సీనియర్ ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లకు 10మంది చొప్పున పరిశోధకులను కేటాయించాలని సూచించారు. యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్లకు కూడా గైడ్‌షిప్ ఇవ్వాలని నిర్ణయించినందున ఒక్కొక్కరికి నలుగురి చొప్పున పరిశోధకులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ బాధ్యులు వడ్డెపెల్లి మధు, కందికొండ తిరుపతి, నిమ్మల సోమరాజ్, బొట్ల మనోహర్, సల్మాన్‌రాజ్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మామునూరు: వరంగల్ సత్యసాయినగర్‌లోని సమతానగర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి రామకృష్ణశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో పోచమ్మకు అభిషేకాలు, అర్చనలు చేశారు. ముఖ్యఅతిథిగా శంభునిపేట, విశ్వనాథకాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ హాజరై పోచమ్మను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రామానుజన్, జగదీశ్వర్ స్వామి, నాగబండి శ్రీనివాస్ గుప్తా, రాంబాబు, తరగల శ్రీధర్, రాజేశ్వర్‌రావు, భిక్షపతి పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారులకు అన్నదానం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి ఆలయంలో హనుమాన్ మాలధారులకు శుక్రవారం అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా వరంగల్ ప్రెస్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ బూర్ల నరేందర్ హాజరై భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వంగరి రవి, చిలుపూరి సురేష్, సమ్మయ్య, భాస్కర్, రవికుమార్, రోజా, సృజన, జర్నలిస్టులు సూర్య ప్రకాష్, ఉపేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రహ్మంగారి ఆరాధన

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి రోడ్డులోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శివాలయం, గాయత్రీమాత ఆలయంలో ఆదివారం ఉదయం ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో హిమాలయ యోగి సంత్ సదానందగిరి స్వామి మహారాజ్ విశిష్ట అతిథిగా పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 100వ జయంతి సందర్భంగా హనుమకొండ రాగన్నదర్వాజ వద్ద ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు చీకటి రాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. కార్యక్రమంలో స్థానికులు మట్ట శ్రీనివాస్‌రెడ్డి, దుంపల రమేష్, తత్తరి హన్మంతు, ఆంజనేయులు, సారంగం, భాషబాయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

1నుంచి డ్రాయింగ్‌లో శిక్షణ తరగతులు

వరంగల్ స్పోర్ట్స్: సాగంటి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్‌లో మే 1నుంచి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు అకాడమీ ఫౌండర్ సాగంటి మంజుల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే, హనుమకొండలోని సర్క్యూట్ హౌస్ రోడ్డులోని కన్నా చెస్ అకాడమీలో చదరంగంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చీఫ్ కన్నా తెలిపారు. వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మొదటి ఆరేళ్లు అత్యంత కీలకం



చిన్నారులతో ఝాన్సీలక్ష్మీబాయి, తదితరులు



కరీమాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో..

హన్మకొండ అర్బన్: మనిషి జీవితంలో మొదటి ఆరేళ్లు అత్యంత కీలకమని జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. హనుమకొండ కుమ్మరివాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇసీసీఇ డేను శుక్రవారం నిర్వహించారు. వడ్డేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ టి.కవిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఝాన్సీలక్ష్మీబాయి మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లల పెరుగుదల, అభివృద్ధి, వికాసం, అభ్యసనం వేగవంతగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సునీత, మంజుల, మౌనిక, శ్రీలత, అంగన్‌వాడీ ఆయాలు, పిల్లలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కరీమాబాద్: పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. కరీమాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ వార్షికోత్సవంలో రవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం పోషకాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. హాజరు శాతం ఎక్కువ ఉన్న పిల్లలకు ప్రోత్సాహకంగా టీచర్ రమాదేవి సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన షీల్డులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, అంజలి, జ్యోతి, మాధవి, సుజాత, రాజేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి – శారద దంపతుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులు శుక్రవారం నిర్వహించారు. 100 జంటలు వ్రతంలో పాల్గొన్నాయి. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ సంప్రోక్షణాభిషేకం జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పలువురికి ఉద్యోగ అవకాశాలు



కేయూ క్యాంపస్: జాబ్‌మేళాలో పాల్గొన్న ప్రిన్సిపాల్, సంస్థ ప్రతినిధులు

కేయూ క్యాంపస్: జెన్‌పాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 50మంది కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య తెలిపారు. తొలుత 30మందికి ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ పత్రాలు అందజేస్తారని, ఆ తరువాత మరో 20మందికి అందజేయనున్నట్లు వెల్లడించారు. జాబ్‌మేళాలో జెన్‌పాక్ట్ కంపెనీ న్యూఢిల్లీ ప్రతినిధులు సాంసన్, చేతన్, ప్రతిపాల్, హరీష్, సాకెత్, రాఘవ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కనకయ్య, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రామప్ప'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్

హన్మకొండ చౌరస్తా: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ లాబరేటరీ కంపెనీ నగరంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని హనుమకొండలోని రామప్ప కళాశాల డైరెక్టర్ ఐలి కర్ణాకర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎన్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, మేనేజర్ పూర్ణచందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి జయంతి



మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్ చౌరస్తా: ఈనెల 30న వాసవీమాత కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ పాత బీటుబజారులో ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి పోచమ్మమైదాన్ వరకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు శ్యాంబాబు, శ్రీనివాస్, పుల్లూరి రవిబాబు, నమఃశివాయ, పరమేశ్వర్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.